
## 36

# శిరోభారం స్త్రీలూ భూభారం పురుషులూ



**గంటకి** ఇన్ని నిమిషాలని చెబుతారు. కాని, నిమషానికి ఎన్ని గంటలో అనిపిస్తుంది. ఒక్కొక్కప్పుడు. లేకపోతే, వెంకటాచలాన్ని కలుసుకుని నలభై ఏళ్ళు దాటిపోయినా ఏదో అదంతా నిన్నా మొన్నా జరిగినట్టు అనిపిస్తుందా?

వెంకటాచలం పెళ్లాంతో సహా రావడం, వాళ్లిద్దరూ ఈ వయస్సులో కూడా ఆరోగ్యంగా ఉండడం రఘురామయ్య దంపతులకి పరమానందం అనిపించింది. నిండు హృదయాలతో ఆహ్వానించారు.

ఆడాళ్లిద్దరూ ఇంటి పనులు చక్కబెట్టుకుంటున్న ఆ రాత్రివేళ ఆ చిన్ననాటి మిత్రులు డాబామీదకి శరీరాలు చేరేసి కబుర్లలో పడ్డారు. రఘురామయ్య మొదలెట్టాడు.

"మళ్లీ ని న్నిలా చూస్తా ననుకోలేదురా, ఇవాళ ఎంత హాయిగా ఉందో!"

"అందుకే కాబోలు, వచ్చిన రెండో రోజున దర్శన మిచ్చావు!"

"సారీరా ...ను వ్చొచ్చావని కబురందగానే ఎంత త్వరగా కలుసుకుందామా అని

కొట్టుకుపోయింది నా ప్రాణి ....వెంటనే కుదిరింది కాదు."

"ఓ వేళ కుదిరి ఉంటే మేం దిగిన పెళ్లివారింటికి వచ్చి, ఇలాగే రెండు మాయ కబుర్లు చెప్పి, అక్కణ్ణుంచి అలాగే రైలు స్టేషనుకి దిగబెట్టేసి ఉండేవాడి వనుకుంటాను. నీ కంటికి మాలాంటి వాళ్లు కనిపిస్తారా బాబూ!"

రఘురామయ్య పక్కున నవ్వుతూ అన్నాడు - "అప్పటికీ, **ఇప్పటికీ** ఏమాత్రం మారలేదురా బాబూ నువ్వు!"

"కాలం గడిచిన కొద్దీ కన్న కలలు నిజాలయితే, అదృష్టం **అం**దలా లెక్కిసేస్తే మనిషి ఎన్ని వేషాలయినా వెయ్యొచ్చు. రోజులు బాగుంటే ఎన్ని మేడలైనా కట్టి, ఎలాంటి పోజులయినా పెట్టొచ్చు. పట్టుకున్న ఏ కొమ్మయినా భళ్లుమని విరిగిపోయే నాలాంటి దరిద్రగొట్టు జాతకుడిలో ఎలా వస్తుందిరా మార్పు, ఎందుకు రావాలి?" అంటూ పై పంచ తీసుకుని కన్నీళ్లు అద్దుకున్నాడు. తన మామూలు మాటకి అతన్నుంచి అలాంటి స్పందన ఆశించని రఘురామయ్య కంగారు పడ్డాడు. ఏం చెప్పాలో తెలీక అలాగే ఉండిపోయాడు.

వెంకటాచలం గద్గద కంఠంతో కొనసాగించాడు - "అయినా ని న్నని ఏం లాభం? నా రాతే అలా ఏడిసింది. కన్న తండ్రే నాకు ద్రోహం చేశాడు. ఉన్న వా ళ్లందరికీ పెద్ద పెద్ద చదువులు చెప్పించాడు. నా క్కాస్త తెలివితేటలు తక్కువే అవొచ్చు. అలాంటప్పుడు ఏ డొనేషనో కట్టి నన్ను పైకి లాగితే నా గీత ఈనా డిలా తగలడునా? మరి నా పిల్లల్ని నే నలా చెయ్యగలిగానా? పెద్ద పెద్ద మొత్తాలు కావని ఇంజనీరింగు లాంటి ఖరీదైన చదువులకి ఎగదోశానా, లేదా? బంగారం లాంటి ఇల్లు అమ్మేశానే, దేనికోసం? ఇంత త్యాగం చేశానా, కళ్లముందు పెరిగిన పిల్ల వెధవలకైనా తల్లిదండ్రుల పట్ల కాస్తంత జాలీ, దయా ఉండాలంటావా? ఎంతసేపూ ఇట్నించి ఆశించడమే కాని, అట్నించి పైసా రాల దనుకో. ఒకర్ని అనుకోడం దేనికిలే, నీలా ముందునుంచీ జాగర్త పడలేని నన్నూ నా కర్మనీ అనుకోవాలి. నీకేం నాయానా, ఏ మాటైనా విసిరేస్తావు. ఉన్న ఊళ్లో సొంత ఇంట్లో పెళ్లికొడుకులా తులతూగుతున్నావు. ఇంత ఉన్నా ఇంకా ఇంకా సంపాదించాలనే దురద, ఈ వయసులోనైనా నీకు చావలేదు. ఒళ్లు హూనం చేసుకుని ట్యూషన్లు చెబుతున్నావు. దాన్తోనైనా తృప్తి పడక నడుం వంగిన పెళ్లాం చేత బేబీ సిట్టింగు చేయిస్తున్నావు. ఏ వేళ వచ్చి నిన్ను కలుసుకుందామన్నా ఇంటి నిండా పిల్లలు! ఏదో ఓ పూటయినా ఆదరించగలిగావు. అ దెంత కాదు! ఇంతకీ పీకపోయినా నా బాధలు నాలో ఇమిడి పోవలసిందే గాని పైకి కక్కను. చిన్నప్పుడు కలసి చదువుకున్న వాళ్లం గనక ఉండబట్టలేక బయట పడిపోయాన్రా రఘురామయ్యా!"

పైన మగాడి మనోవేదన అలా చిన్ననాటి మిత్రుడి ముందు దొర్లిపోయింది గాని, ఆయన భార్య మీనాక్షికి ఆ పట్టింపూ ఉన్నట్టు లేదు. రఘురామయ్య పెళ్లాం సావిత్రిని అదే జీవితంలో మొదటిసారి కలుసుకోవడం. ఆవిడ వాక్ప్రవాహం వరస ఇదీ:

"కృష్ణా, రామా అనుకోవలసిన ఈ వయసులో పొద్దస్తమానం 'గారు గీరు' మంటూ ఇంట్లో మీ కీ పసిపిల్లల పెంట ఏమిటి వదినగారూ? మీకేం లేదా, పోదా! శుచీ శుభ్రం లేకపోతే నా సొంత మనవల్నైనా నేను వేలేసి ముట్టుకోను సుమండీ! అందుకే తన కూతురి పురుళ్ల పూచీ ఒకటే కాదు, మా వియ్యపురాలికి నేనుపెట్టిన కండిషను ఏమిటో తెలుసా? ఆ మనవల్ని అయిదేళ్లొచ్చేదాకా మా ఇంటికి దిగబెట్టడానికి కుదరదని, అవునండీ, అలా ఆశ్చర్యంగా చూస్తారేం? తన కూతురేమో

మూడు ముస్తాబులూ అయి ఉద్యోగం వంక పెట్టుకుని ఏ ఆఫీసులోనే ఫాను కింద జల్సా చేస్తూంటే, నే నింట్లో రోజంతా చాకిరీ చేస్తూ ఆ గుంట వెధవల్ని సాకాలా? మనవలు కదా అని మమకారంలో పడిపోతే లోకువ కట్టి పిల్లలు మనల్ని ఆడించెయ్యరు టండీ? పోనీ పెద్దదాన్ని తెచ్చిన ఆ జీతపు రాళ్ల సాటి ఆడదైనా నా చేతిలో పొయ్యాలా, అక్కర్లేదా? ఎన్నిసార్లు గింజుకున్నానా మాటే అంత లక్ష్యం లేకపోయాక ఇంట్లో ఇటు వస్తువు అటు పెట్టే అవసరం నా కేమిటంట? నీతి-నియమం, ధర్మం-న్యాయం, పెద్దా-చిన్నా అన్నీ చచ్చేయండి ఈ లోకంలో!"

వాళ్ల భోజనాలు అయాక, ఇన్నాళ్లకి ఇంటి కొచ్చిన ముత్తైదుకి పసుపూ కుంకుమా, రవికల గుడ్డా, పళ్లూ ఇచ్చి సాగనంపాక కూడా వాళ్లు సృష్టించిన హోరునుండి తప్పించుకోడానికి అవలేదు ఆ దంపతులకి. అసలు ఆదివారం తప్ప తీరిక ఉండదు వాళ్లకి. ఏ పాత తెలుగు సినిమా కాసెట్టో తెచ్చుకుని వేసుకుంటారు. అంతే! ఆ వారం ఆ అదృష్టానికీ నోచుకోలేదు వాళ్లు. పైగా ఆ గాభరా నుంచి తేరుకోడం అంత సుళువా!

"ఇన్నాళ్లకి కలిసిన స్నేహితుడు కదా, ఎన్నో చెప్పుకుందా మనుకున్నాను. తన గోడ వేదో తప్ప మాట వరసకైనా మన గురించి అడగలేదు వాడు. ఇంకేం చెప్పను!" అన్నాడు రఘురామయ్య.

"మీరు పిల్లలకి పాఠాలు చెప్పడం, నేను ఇంట్లో ఓ అరడజను మందికి బేబీ సిట్టింగ్ చెయ్యడం - ఇదంతా డబ్బాశతోనే అనుకుంటున్నారు వాళ్లు. నే చెబ్దా మనుకున్నాను గాని ఉన్న విషయం మీరే చేస్తే బావుంటుందని ఊరుకున్నాను. అదైనా చెప్పవలసింది."

"మనం చేసే పనుల్ని చూసి వారి వారి సంస్కారాలని బట్టి జనం ఓ నిర్ణయానికి వస్తారు. అసలు విషయం చెప్పినా నమ్ముతారని గారంటీ ఏమిటి?"

ఆ దంపతులకి నలుగురు కొడుకులూ, ఇద్దరు కూతుళ్లూ, ఆడా-మగా అందరికీ పెద్ద పెద్ద చదువులు, అందరివీ పెద్ద ఉద్యోగాలు. ఇద్దరు కూతుళ్లూ, ఇద్దరు కొడుకులూ ఫారెన్‌లో సెటిలయిపోయారు. దేశంలో ఉన్న ఇద్దరు కొడుకులూ బొంబాయిలో ఒకడూ, ఢిల్లీలో ఒకడూ వేరే ఫ్లాట్సు కొనుక్కుని స్థిరపడిపోయారు. రఘురామయ్యకి ఓ రెండు వేల దాకా పెన్షన్ వస్తుంది. సొంతింట్లో స్థిరపడిపోయాడు. పదిమందిని పెంచి పెద్ద చేసిందేమో, సావిత్రికి ఒక్కర్తీ ఉండడం - అంతమంది పిల్లలూ, మనవలూ ఉండగా - కలచివేసినట్లు అయింది. పైకి చెప్పడు గాని యాక్టివ్ లైఫ్ లీడ్ చేసిన రఘురామయ్యకి మరీ దిగులు అనిపించింది. ఒకరికి బరువు కాకుండా చివరి రోజులు గడవడానికి వాళ్లు వెదుక్కున్న కాలక్షేప మార్గం ఇది. అన్నం, బట్టా, మూడొందలు జీతం ఇచ్చి పసిపిల్లల పనులతో సహా ఇంటి పనులన్నీ చెయ్యడానికి ఓ దిక్కులేని విధవరాల్ని కుదుర్చుకుంది సావిత్రి. బేబీ సిట్టింగ్ బాధ్యత తనది గాని, పనులన్నీ ఆవిడవే. డియ్యీవోగా పదవీ విరమణ చేసిన రఘురామయ్య గారికి పిల్లలకి పాఠాలు చెప్పడంలో ఇంకొకరి సాయం అక్కర్లేదు. ఇంతకీ పసిపిల్లల్ని సాకినా, పెద్ద పిల్లలకి పాఠాలు చెప్పినా, వాళ్లు చేసేది ఫ్రీగానే!

"మావాణ్ణి మించిన దాన్లా ఉంది వాడి పెళ్లాం. ఒక్కరోజు దెబ్బకే ఇప్పటికే తట్టుకోలేకపోతున్నాం మనం. ఇలాంటి భారీ మనుమలతో సరిపెట్టుకోలేక వాళ్ల పిల్లలు నిత్యం ఎంతగా క్రుంగిపోతున్నారో!" అన్నాడు రఘురామయ్య.

*(ఆంధ్రప్రభ సచిత్ర వారపత్రిక, 11-09-91)*

## భూభారం పురుషులూ శిరోభారం స్త్రీలు